AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

WWW.AKSHARATODAYNEWS.COM

7-7-2026 (Tuesday) MAIN EDITION

## ఇ25 పెట్రోల్ వైపు భారత్ అడుగులు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితులు, పెరుగుతున్న ఇంధన అవసరాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే దేశంలో విజయవంతంగా అమలు చేస్తున్న 'ఇ20' (20 శాతం ఇథనాల్) పెట్రోల్ తర్వాత, ఇప్పుడు దానికి కొనసాగింపుగా ఇ21 నుండి ఇ25 వరకు ఇథనాల్ మిశ్రమంతో కూడిన పెట్రోల్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. 2027 నాటికి 21 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను, 2029 నాటికి 25 శాతం ఇథనాల్ మిశ్రమంతో కూడిన 'E25' పెట్రోల్‌ను దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## రిటైర్డ్ టీచర్ ఆత్మహత్య



**అక్షరటుడే, వరంగల్ :** జనగామకు చెందిన పగిడిపల్లి మల్లయ్య అనే రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లోనే ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. రిటైర్మెంట్ తర్వాత రావాల్సిన పూర్తి బెనిఫిట్స్ రాకపోవడంతో ఆయన గత రెండేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన నిధుల కోసం ఆయన కోర్టును కూడా ఆశ్రయించారు. దీనికి తోడు తన బావమరుదులు గుంటి రత్నాకర్, మనోహర్ తన వద్ద తీసుకున్న డబ్బులు ఇవ్వలేదు. దీంతో ఆయన 33 పేజీల సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నారు.

## అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష



అక్షరటుడే, హైదరాబాద్ : వ్యవసాయశాఖ అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఆయిల్ పామ్ మొక్కలు, డ్రిప్ పరికరాల సరఫరాలో ఆటంకాలు ఉండొద్దని, మొక్కజొన్న కొనుగోళ్ల పేమెంట్లు, సొసైటీలకు యూరియా సరఫరాపై ఆరా తీశారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

## డైలీ షటిల్స్ సర్వీసులు ప్రారంభం



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : హైదరాబాద్ జేఆర్సీ కన్వెన్షన్‌లో ఐటీ ఉద్యోగుల కోసం డైలీ షటిల్స్ సర్వీసులను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మార్చేందుకు లాస్ట్ మైల్ కనెక్టివిటీ, ఈవీ పాలసీ, ఆర్టీసీలో 350 కొత్త రూట్లతో పాటు ప్రజా రవాణా బలోపేతం చేస్తున్నామని ఆయన తెలిపారు.

## ఒకటో తేదిన జీతాలు చెల్లించాలి



అక్షరటుడే, హైదరాబద్ సిటీ : కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం మంజూరు చేసినా సమయానికి జీతాలు చెల్లించని ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలన్నారు.

## వాణిజ్య నౌకపై ఇరాన్ దాడి




**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** హర్ముజ్ జలసంధి మీదుగా ప్రయాణిస్తున్న మరో నౌకపై ఇరాన్ దాడి చేసింది. ఒమన్‌లోని లిమాకు తూర్పున ప్రయాణిస్తున్న ఒక ట్యాంకర్ దాడి చేయడంతో మంటలు చెలరేగాయి. నౌకలపై ఇరాన్ కనీసం 2 క్షిపణులను ప్రయోగించిందని తెలుస్తోంది. హెచ్చరికలను నిర్లక్ష్యం చేసినందుకే ద్రవీకృత సహజ వాయువు ట్యాంకర్‌పై దాడి జరిగిందని ఇరాన్ టెలివిజన్ తెలిపింది. కానీ టెహ్రాన్ ఈ దాడికి నేరుగా బాధ్యత వహించలేదు. హర్ముజ్ జలసంధి మీదుగా తాము ఆమోదించిన మార్గం మాత్రమే సురక్షితమని టెహ్రాన్ ప్రకటించింది. ఒమన్ తీరానికి సమీపంలో ఉన్న మరో మార్గాన్ని ఉపయోగించిన ఇతర నౌకలపై కూడా ఇదే దాడి చేసినట్లు అనుమానిస్తున్నారు. ఒమన్‌లోని లిమా సమీపంలో ట్యాంకర్‌పై దాడి జరిగిందని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ కేంద్రం తెలిపింది. ఆ నౌక జలసంధి నుంచి దక్షిణంగా ఒమన్ గల్ఫ్ వైపు ప్రయాణించడానికి ప్రయత్నిస్తుండగా క్షిపణి దాడి జరిగిందని పేర్కొంది.

# 38 మందికి ఉరిశిక్ష



**గుజరాత్‌లో అహ్మదాబాద్ నగరంలో పేలుళ్లకు పాల్పడిన నిందితులకు గుజరాత్ హైకోర్టు ఉరిశిక్ష విధించింది. 2008లో వరుస పేలుళ్లలో మరణ హోమం సృష్టించిన కేసులో.. ధర్మాసనం తాజాగా సంచలన తీర్పు వెలువరించింది. దిగువ కోర్టు తీర్పును సమర్థించి 38 మందికి ఉరి శిక్ష, 11 మందికి యావజ్జీవ కారాగార శిక్షను ఖరారు చేసింది.**

**- అక్షరటుడే, నేషనల్ డెస్క్**

- అహ్మదాబాద్ పేలుళ్ల కేసుల్లో..
- గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు
- 11 మందికి జీవిత ఖైదు

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో 2008లో జరిగిన వరుస పేలుళ్ల కేసులో 38 మందికి మరణశిక్ష, మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును గుజరాత్ హైకోర్టు మంగళవారం సమర్థించింది. ఈ పేలుళ్లలో 56 మంది మరణించగా, 246 మంది గాయపడ్డారు. మృతులకు రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు, సాధారణ గాయాలకు రూ.1 లక్ష చొప్పున నష్టపరిహారం చెల్లించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ చెల్లింపును 2027 మార్చి 31లోగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది.

### వరుస పేలుళ్లు..

అహ్మదాబాద్‌లో 2008 జూలై 26న పలు పేలుళ్లు జరగ్గా, రెండు రోజుల తర్వాత సూరత్‌లో బాంబులు లభ్యమయ్యాయి. సివిల్ ఆసుపత్రి, అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని ఎల్‌జీ ఆసుపత్రితో పాటు బస్సులు, పార్క్ చేసిన సైకిళ్లు, కార్లు, ఇతర ప్రదేశాలలో మొత్తం 22 బాంబులు పేలాయి. ఈ ఘటనలో 56 మంది మరణించగా, సుమారు 246 మంది గాయపడ్డారు. నగర క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తులో ఈ నేరానికి సంబంధించి 100 మందికి పైగా నిందితులుగా పేర్కొనగా, 78 మందిపై విచారణ చేపట్టారు.

### 49 మంది దోషులుగా..

ఈ పేలుళ్లపై 2022 ఫిబ్రవరిలో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా నిర్ధారించి, మరో 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. కుట్ర పన్నారని, బెదిరింపు మెయిల్స్ పంపారని, ఉగ్రదాడికి తామే బాధ్యులమని ప్రకటించుకున్నారని ఆరోపణలు ఎదుర్కొన్న ముబిన్ షేక్, మన్సూర్ పిర్భోయ్‌లు నిర్దోషులుగా విడుదలయ్యారు. 2022లో విచారణ కోర్టు తీర్పు వెలువడిన వెంటనే నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ అప్పీళ్లపై జస్టిస్ ఎ.వై. కోగ్జే, జస్టిస్ సమీర్ దవేలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టి తాజాగా తీర్పు వెలువరించింది.

## ప్రధాని మోదీకి ఇండోనేషియా అత్యున్నత పురస్కారం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇండోనేషియా పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీకి ఆ దేశం అత్యున్నత గౌరవాన్ని అందించింది. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో చేతుల మీదుగా మోదీ 'బింటాంగ్ ఆదిపూర్ణ రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేసియా' పురస్కారాన్ని అందుకున్నారు. భారత్ ఇండోనేషియా మధ్య ద్వైపాక్షిక బంధాన్ని బలోపేతం చేయడంలో ప్రధాని మోదీ పోషించిన పాత్రకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. జాకార్తాలోని అధ్యక్ష భవనం 'ఇస్తానా మెర్డెకా'లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీకి ఘన స్వాగతం లభించింది. ఆయన మాట్లాడుతూ, ఈ అవార్డు తనకు మాత్రమే కాకుండా, భారత ప్రజలందరికీ లభించిన గౌరవమని పేర్కొన్నారు. ఇండోనేసియా దేశాభివృద్ధికి, సార్వభౌమత్వానికి కృషి చేసిన ప్రముఖులకు 1959 నుండి ఈ అత్యున్నత పురస్కారాన్ని అందజేస్తున్నారు.

## ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు నోటీసులు



**అక్షరటుడే, హైదరాబాద్ :** హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో భారీ భవనం నిర్మిస్తున్న ప్రదీప్ కన్‌స్ట్రక్షన్‌కు జీహెచ్‌ఎంసీ అధికారులు షాక్ ఇచ్చారు. భవన అనుమతిని రద్దు చేస్తూ షో కాజ్ నోటీసు జారీ చేశారు. అలాగే, నో ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ కూడా జారీ చేశారు. సోమాజిగూడలోని రాజభవన్ రోడ్డులో ఈ బహుళ అంతస్తుల గ్రూప్ హౌసింగ్ ప్రాజెక్ట్ నిర్మించారు. అయితే హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో దీనిని నిర్మించినట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో సోమవారం హైడ్రా, జీహెచ్‌ఎంసీ కమిషనర్లు రంగనాథ్ గారు, ఆర్వీ కర్ణన్ ఆ భవనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణానికి తమ నుంచి ఎలాంటి అనుమతులు లేవని ఇరిగేషన్ శాఖ తెలిపింది. ఈ కంపెనీ యజమాని ప్రదీప్ రెడ్డి బద్వేలు. జన్వాడలో ఉన్న ఒక ఫామ్‌హౌస్‌పై యాజమాన్యాన్ని క్లెయిమ్ చేసిన వ్యక్తి ఈయనే కావడం గమనార్హం. ఆ ఫామ్‌హౌస్ మాజీ మంత్రి కేటీఆర్‌కు చెందిందని సీఎం గతంలో ఆరోపించారు.

## భువనగిరి మాజీ ఎమ్మెల్యే మృతి



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి (83) మంగళవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న ఆయన హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. నర్సింహారెడ్డి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. 1969 ఉద్యమంలో పాల్గొన్నారు. ప్రజా చైతన్య వేదికను స్థాపించారు. గోదావరి జలాల సాధన కోసం, , మూసీ పరిరక్షణ ఉద్యమించారు. ఆయన అంత్యక్రియలు బుధవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నర్సింహా రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

## మహిళ ఇంట్లోకి నగ్నంగా చొరబడ్డ కౌన్సిలర్



**అక్షరటుడే, వరంగల్ :** జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలం చాగల్లులో వార్డు కౌన్సిలర్ సంపత్ రాజ్ సోమవారం అర్ధరాత్రి ఒంటిపై నులు పోగు లేకుండా స్థానికంగా ఉండే ఓ వృద్ధురాలి ఇంట్లోకి చొరబడ్డాడు. ఆమెపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు కేకలు వేసింది. స్థానికులు, కుటుంబ సభ్యులు అక్కడకు వచ్చారు. అందరిని చూసి భయపడిన నిందితుడు బాత్‌రూమ్‌లోకి వెళ్లాడు. వెంటనే స్థానికులు బయట నుంచి గడియ పెట్టారు. అనంతరం స్టేషన్ ఘన్‌పూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కౌన్సిలర్ సంపత్ రాజ్‌ను అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు.

## కవితకు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురు



**అక్షరటుడే, హైదరాబాద్ :** తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవితకు హైకోర్టులో చుక్కెదురు అయింది. టీఆర్ఎస్ పేరు మార్చుకోవాలని ఎన్నికల సంఘం కవితకు లేఖ రాసిన విషయం తెలిసిందే. దీనిపై ఆమె ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఆమె ప్రతిపాదించిన ప్రత్యామ్నాయ పేరు టీఆర్ఎస్ అర్థం చేసుకునే అవకాశం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ దశలో పిటిషన్‌ను పరిశీలించడం ఎన్నికల సంఘం చట్టబద్ధమైన విధుల్లో జోక్యం చేసుకోవడమేనని పేర్కొన్న కోర్టు, ముందుగా ఎన్నికల సంఘం నోటీసుకు సరైన సమాధానం సమర్పించాలని కవితను ఆదేశించింది. ఆమెకు వారం రోజులు సమయం ఇవ్వాలని ఈసీకి సూచించింది.

## మొబైల్ అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం




**అక్షరటుడే, హైదరాబాద్:** చిన్నారులే దేశ సంపద అని మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ-2047 లక్ష్య సాధనలో నేటి చిన్నారులే కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. ఏ ఒక్క చిన్నారికీ అంగన్‌వాడీ సేవలకు దూరం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభిస్తోందని తెలిపారు. కార్మిక శాఖ మంత్రి వివేక్‌తో కలిసి కార్మిక శాఖ సహకారంతో మహిళా, శిశు సంక్షేమ శాఖ రూపొందించిన మొబైల్ అంగన్‌వాడీ వాహనాన్ని జెండా ఊపి ఆమె ప్రారంభించారు. ఈ వాహనం మేడ్చల్ జిల్లాలోని ఇందిరమ్మ కాలనీలో అంగన్‌వాడీ సేవలు అందించనుంది. పనుల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వలస వచ్చే కార్మికుల పిల్లలు అంగన్‌వాడీ సేవలకు దూరం కాకుండా మొబైల్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

## వయనాడ్‌లో విరిగిపడ్డ కొండ చరియలు



**అక్షరటుడే, కేరళ :** కేరళలోని వయనాడ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం రాత్రి నుండి కురుస్తున్న వర్షాలతో మంగళవారం వయనాడ్ జిల్లాలో భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. శిథిలాల కింద పలువురు చిక్కుకుని ఉన్నారనే సమాచారంతో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. మలప్పురం, వయనాడ్ జిల్లాలను కలిపే అనక్కాంపోయిల్‌మెప్పాడి టన్నెల్ రోడ్డు ప్రాజెక్ట్ పనులు జరుగుతున్న ప్రాంతానికి సమీపంలోని కల్లాడి వద్ద ఉన్న మీనాక్షి వంతెన దగ్గర కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడ నిర్మాణ కార్మికులు ఉన్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక, రక్షణ శాఖ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేరళ ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి టి. సిద్ధిక్‌తో అత్యవసర సమావేశం నిర్వహించారు. యుద్ధ ప్రాతిపదికన సహాయక, పునరావాస చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.